క్లుప్తంగా

హుండీ దాతకు సన్మానం



దాతను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: అంతిరింతిరి కొండపై వెలసిన ప్రసన్నాంజనేయ స్వామివారి దేవాలయానికి మద్ది అనిత, మల్లేశ్ దంపతులు శనివారం హుండీని బహూకరించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజు, రవి, రామచంద్రయ్య, మల్లేశ్, కొండల్, కష్ణ, శ్రీశైలం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుడితండాలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు కేటాయించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే.. సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వప్న సురేష్, రాము, వికీయ, చంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో సంఘం పాత్ర కీలకం



సహకార గీతాన్ని ఆలపిస్తున్న సంఘం సభ్యులు

తుర్కయంజాల్: వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర కీలకమని రైతుసేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సహకార గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, సెక్రటరి వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు

సాక్షి రంగారెడ్డి జిల్లా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి అనే విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. ఏబీవీపీ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం విద్యార్థి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్తీక దీపారాధన



దీపారాధన చేస్తున్న భక్తులు

మంచాల: కార్తీకమాసం పురస్కరించుకుని మండల పరిధి తాళ్లపల్లిగూడలో భవానీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు శనివారం ఆలయ చైర్మన్ భిక్షపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర దీపాలంకరణతో పాటు రుద్రాభిషేకం నిర్వహించారు.

సర్వే వేగవంతం చేయాలి

ఎంపీడీఓ బాల శంకర్

మంచాల: కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. శనివారం మండలంలోని ఆగాపల్లిలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. సమగ్ర సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. సమాచారం సేకరించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ప్రజలు అపోహలు వీడి, అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు అనిల్, వెంకటేశ్, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసులు అధ్వానం..

- శిథిల భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- భయాందోళనలో అధికారులు, సిబ్బంది
- నూతన భవనాలు నిర్మించాలి: ప్రజలు



మండల పరిషత్ శిథిల భవనం

మాడ్గుల: దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు అధ్వానంగా మారాయి. పూర్తిగా శిథిలా వస్థకు చేరి సిబ్బందిని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు నిర్మించి నాలుగు దశాబ్దాలు దాటి, పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్పుడప్పుడు పెచ్చులూడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాలు కురిసినప్పుడు కురిసి, కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తోంది.

పెచ్చులు ఊడి.. బీటలు వారి

మండలం పరిధి గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావ్యవస్థకు చేరాయి. ఆయా భవనాల గోడలు బీటలు వారాయి. స్లాబ్‌ల పెచ్చులు ఊడి దర్శమిస్తున్నాయి. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం శిథిలా వస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం రైతు వేదికలో కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు పని నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శిథిల భవనాల్లో కార్యకలాపాలు కొనసాగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం తెచ్చిపెడుతుందోనని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిల భవనాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై గతంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విన్నవించారు. శిథిల భవనాలతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తహసీల్, మండల పరిషత్ కార్యాలయాలను నూతనంగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మండల విద్యాధికారి రాందాస్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాందాస్

మంచాల: కష్టపడి చదువుకుంటే.. మంచి మార్కులు సాధించవచ్చని ఎంఈఓ రాందాస్ అన్నారు. శనివారం మండల పరిధి రంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని, పాఠశాలకు సయమానుకులంగా రావాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని, వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా చదువుకొని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించి, విద్యార్థులను మరింత ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దాడికాదు.. తిరుగుబాటు



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్‌నాయక్ తదితరులు

- గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: ఫార్మాసిటీ ఏర్పాటును రైతులు వ్యతిరేకిస్తున్నా.. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం మంచిదికాదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు, భూ సేకరణ తదితర అంశాలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులపై రైతులు చేసింది దాడి కాదని, అది తిరుగుబాటేనని పేర్కొన్నారు. వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి, తన అల్లుడి స్వప్రయోజనాల కోసం, అక్రమంగా గిరిజనుల భూములను లాక్కొంటున్నారని ఆరోపించారు. భూసేకరణను అడ్డుకుంటున్న రైతులపై కేసులు పెట్టి చిత్ర హింసలు పెడుతున్నారని విమర్శించారు. కేసులు వెంటనే ఎత్తివేయాలని, లేని పక్షంలో 2 వేల మంది గిరిజనులతో కలిసి కొడంగల్ చౌరస్తాలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. భూములు కోల్పోతున్న వారికి అండగా ఉంటామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు హరిచంద్, కస్నానాయక్, లోకేశ్, నాయకులు రమణ, పాండు, భీమన్, సోమ్లా, భీమన్, అంజినాయక్, జగన్, బీచ్యా ఉన్నారు.

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

సాక్షి రంగారెడ్డి జిల్లా: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం పాషనరహరి స్మారక కేంద్రంలో శనివారం సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్ నుంచి కార్మిక సంఘాలను వేధిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలని సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించి, కార్మికులు ప్రశ్నించకుండా చేసి, ఇష్టారాజ్యంగా నడిపిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఈ నెల 19న హైదరాబాద్ బస్ భవన్, జిల్లాల్లోని అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రమోహన్, జగదీశ్ కవిత, బ్రహ్మయ్య, ఎల్లేశ్, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

- మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి

మీర్‌పేట: మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీఓ 60ని వెంటనే అమలు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏఐటీయూసీ బాలాపూర్ మండల నాయకులు వెంకటరమణారెడ్డి, మండల కార్యదర్శి నరేందర్‌లతో కలిసి జైపాల్‌రెడ్డి మీర్‌పేట కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పనిచేస్తున్న వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్స్, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి రూ.19,500, అదేవిధంగా కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు రూ.22,750ల కనీస వేతనాలు ఇవ్వాలన్న ఉద్దేశంతో గత సంవత్సరం ప్రభుత్వం జీఓ 60ని విడుదల చేసిందన్నారు. ఇప్పటికైనా మీర్‌పేట కార్పొరేషన్‌లో ఎంతో కాలంగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడాలని కమిషనర్‌ను కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ జీఓ కాపీని ఉన్నతాధికారులకు పంపిస్తానని హామీనిచ్చినట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు.

ఘన నివాళి

సాక్షి రంగారెడ్డి జిల్లా: సీపీఎం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి నాగటి రవీందర్ తల్లి, పార్టీ నాయకురాలు గౌరమ్మ శనివారం మండల పరిధి ధర్మన్నగూడెంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గౌరమ్మ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ, నాయకులు యాదయ్య, సామేల్, జంగయ్య, ఆలంపల్లి నర్సింహ, జగన్ తదితరులు పాల్గొన్నారు.



గౌరమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని తదితరులు

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది



సమావేశంలో బీజేపీ శ్రేణులు

- గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- ప్రజా సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్
- బీజేపీ జిల్లా నాయకుడు బక్కికుమార్

కడ్తాల్: రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజా సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్.. అధికారం చేపట్టి ఏడాది పూర్తి కావస్తున్నా.. హామీల అమలులో పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల ముందస్తు కార్యాచరణ, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం తదితర అంశాలపై చర్చించారు. అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆ పార్టీ మండల ఇన్‌చార్జి బక్కికుమార్ మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతులు, దివ్యాంగుల పింఛన్ పెంచలేదని, ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతులకు సాగు సాయం చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. రుణమాఫీ అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ప్రజలకు మద్దతుగా ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమయిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, రాష్ట్ర నాయకులు భగీరథ్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్, నాయకులు మహేశ్, శ్రీశైలం, వెంకటేశ్, రాందాస్‌నాయక్, కుమార్, అంజయ్య ఉన్నారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం



జర్నలిస్టులను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక తదితర అంశాలను నిష్పక్షపాతంగా సమన్వయం చేస్తూ, మంచి చెడులను ఎత్తి చూపుతూ ఏ స్వార్థం లేకుండా సమాజ శ్రేయస్సుకోసం పాటుపడే వారని పేర్కొన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో ఆయన జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా విలేకరులు పనిచేస్తున్నారని తెలిపారు. నిజాన్ని నిర్భయంగా రాస్తూ.. ప్రభుత్వాన్ని, ప్రజలను చైతన్య పర్చడంలో జర్నలిస్టులు ముందుంటారని వివరించారు. నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే విలేకరుల జీవితాలు దయనీయంగా ఉన్నాయని, అలాంటి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సీహెచ్ భూపాల్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు విష్ణువర్ధన్, అధ్యక్షుడు దర్పుల శంకర్, చంద్రకుమార్, వెంకట్ రెడ్డి, రాజేందర్, శ్రీను, గణేశ్, సింగిల్‌విండో శేఖర్, రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



కడ్తాల్: వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్



ఇబ్రహీంపట్నం రూరల్‌లో.. కమిషనర్ బాలకృష్ణ



తలకొండపల్లిలో..

- ఇంటింటికీ ఎన్యుమరేటర్లు
- సర్వే ప్రక్రియను పరిశీలించిన అధికారులు

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రశాంతంగా కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రం, పరిధి గ్రామాల్లో కులగణన ముమ్మరంగా సాగింది. ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. సర్వే ప్రక్రియను ఎంపీడీఓ సుజాత, సూపర్‌వైజర్లు వాగ్దేవి, శ్రావ్య, రవితేజ పర్యవేక్షించారు.

ఆదిబట్లలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో కులగణన వేగంగా కొనసాగుతోంది. 47మంది ఎన్యుమరేటర్లతో 15 వార్డుల్లో సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు సలహాలు, సూచనలు చేశారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: సమగ్ర కుటుంబ సర్వే చురుగ్గా కొనసాగుతోంది. తలకొండపల్లి, చుక్కాపూర్, మెదక్‌పల్లి, జంగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వేగిరం అయింది. మండల పరిధిలో 14,385 ఇళ్లకు గాను.. ఇప్పటి వరకు సుమారు 8వేల కుటుంబాల నుంచి సమాచారం సేకరించామని ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు.



ఆమనగల్లు: సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత

భగవాన్ బిర్సాముండా పోరాటం ఆదర్శం

షాద్‌నగర్‌రూరల్: గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిశలు పోరాడిన భగవాన్ బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ నీతా సూచించారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సాముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థినులతో కలిసి బిర్సాముండా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బిర్సాముండా జీవిత చరిత్రపై విద్యార్థినులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మహనీయుల జీవిత చరిత్ర, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి బిర్సాముండా అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, భవిష్యత్‌లో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. దేశ భద్రతను కాపాడటంతో పాటుగా ప్రజల హక్కులకోసం నిరంతరం ఉద్యమించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

గురుస్వామి గిరిషన్ నాయర్

నందిగామ: మాల ధరించిన అయ్యప్ప భక్తులకు అన్నదానం చేయడం మహాపుణ్యం అని గురుస్వామి గిరిషన్‌నాయర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ శివారులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గురుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ జంగారి రాములు ఆర్థికసాయంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఏటా కార్తీక మాసంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, సుమారు రెండునెలల పాటు నిత్యం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అన్నదాత రాములును గురుస్వాములు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు సుదర్శన్‌గౌడ్, తుమ్మల నర్సింహ, మాదారం నర్సింహ, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో భక్తజనం

ఘనంగా మైసమ్మ జాతర

మైసిగండి మైసమ్మ జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, హోమాలు నిర్వహించారు. వేడుకల్లో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలి, ఈఓ స్నేహలత, నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు. – కడ్తాల్